సాక్షి ఒడిశా

బుధవారం । 7 । జూన్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.77,924లు, వెండి 29.5 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



కన్నవారింటి నుంచి అమ్మవారికి పిలుపు

- 8లో



వికటించిన మాత్రలు!

- కాలం చెల్లిన మందులు వేయడంతో 11నెలల చిన్నారి మృతి

- 8లో

న్యూస్‌రీల్

నేడు 5టీ కార్యదర్శి పర్యటన



వీకే పాండ్యన్

రాయగడ: రాష్ట్ర ప్రభుత్వ 5టీ కార్యదర్శి వీకే పాండ్యన్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 2రోజులు పర్యటించనున్నారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం 4.30 గంటలకు రాయగడలోని గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో ప్రత్యేక హెలీకాప్టర్‌లో చేరుకోనున్నారు. అనంతరం 5.40 గంటలకు బిజూ పట్నాయక్ కళాశాల ఆడిటోరియమ్‌లో ఉన్నత పాఠశాలల విద్యార్థులను కలుసుకుంటారు. అనంతరం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో పర్యటిస్తారు. ఆమో హాస్పిటల్ పథకంలో భాగంగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తారు. సాయంత్రం 6.20 గంటలకు రాయగడలో నిర్మిస్తున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను పరిశీలించి, క్రీడాకారులతో మమేకమవుతారు. 6.55 గంటలకు పట్టణంలో ఉన్న పురాతనమైన బాలింకేశ్వర మందిరం, అక్కడి నుంచి మజ్జిగౌరి మందిరాన్ని సందర్శిస్తారు. అలాగే గురువారం బిసంకటక్ సమితిలోని చిటికొన శైవక్షేత్రాన్ని దర్శించుకుంటారు. గుణుపూర్‌లో మినీ స్టేడియం పనులను పరిశీలించడంతో పాటు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

నాగేశ్వరి గుహలను సందర్శించిన కొరాపుట్ ఎంపీ



బల్దాలోని నాగేశ్వరి గుహలను పరిశీలిస్తున్న ఎంపీ సప్తగిరి ఉల్క బృందం

కొరాపుట్: వివాదాస్పద నాగేశ్వరి గుహలను కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క మంగళవారం సందర్శించారు. కొరాపుట్ జిల్లాలోని నందపూర్ సమితి బల్దా పంచాయతీ నాగేశ్వరి పర్వతంలో ఇవి ఉన్నాయి. పర్వతంలో గనుల తవ్వకానికి ఆదానీ కంపెనీకి ప్రభుత్వం అనుమతిచ్చింది. దీనిని పర్వత పరిధిలోని 5 పంచాయతీల ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. ఇప్పటికే స్టాక్ ఎక్స్ఛేంజీ బల్దాలో గనుల తవ్వకంపై తమకు ప్రభుత్వం అనుమతిచ్చిందని లిస్టింగ్ కంపెనీ చెబుతోంది. మరో వైపు గనుల తవ్వకానికి అనుమతి ఇవ్వవద్దని ఆయా గ్రామాల గిరిజనులు ఆందోళనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ తన అనుచరులతో కలిసి, ఈ గుహలలో కలియ తిరిగారు. అనంతరం అదానీకి వ్యతిరేకంగా గుహలను రక్షించుకోవాలని సామాజిక మాధ్యమాలలో ఎంపీ ప్రకటన చేశారు. ఆయన వెంట పొట్టంగి మాజీ ఎమ్మెల్యే రాం ఖడం, పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

- రూ.1.45 లక్షల నగదు



పట్టుబడిన నగదు, నిందితులతో పోలీసులు

బరంపురం: జిల్లా పోలీసు పరిధిలోని గిరిసిలా గ్రామంలో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న జూదం అడ్డాపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. దీనికి సంబంధించి ముగ్గురు జూదరులను అరెస్ట్ చేశామని ఐఐసీ అధికారి జిత్రేంద్ర మల్లిక్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు దాడి చేయగా, నిందితుల నుంచి రూ.1.45 లక్షల నగదు, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

ప్రశ్నల వర్షం

- బహనాగా బజార్ దుర్ఘటనపై దర్యాప్తు ప్రారంభించిన సీబీఐ
- ఘటనా స్థలం, స్టేషన్లో సిగ్నలింగ్ వ్యవస్థ పరిశీలన
- రెండో రోజు కొనసాగిన రైల్వే భద్రతా కమిషనర్ విచారణ
- మొత్తం మృతులు 288.. ఒడిశావాసులు 39మంది





బహనాగా బజార్ రైల్వేస్టేషన్‌లో సిగ్నలింగ్ వ్యవస్థపై రైల్వే సిబ్బందిని ప్రశ్నిస్తున్న సీబీఐ అధికారులు

భువనేశ్వర్: రాష్ట్రంలో సంభవించిన ట్రిపుల్ రైలు ప్రమాదం కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) మంగళవారం వెల్లడించింది. ఈనెల 2న బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్‌లో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, యశ్వంత్‌పూర్-హౌరా ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైలుకు మధ్య జరిగిన ఘోర రైలు ప్రమాదానికి సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడేందుకు సీబీఐకి చెందిన 10మంది సభ్యుల బృందం సోమవారం రాత్రి ఒడిశాకు చేరుకుంది. ఈ మేరకు ఘటనా స్థలాన్ని అధికారులు పరిశీలించారు. రైల్వేశాఖ అభ్యర్థన మేరకు, ఒడిశా ప్రభుత్వ సమ్మతితో కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు వర్గం సభ్యులు తెలిపారు. ఈ దుర్ఘటనకు సంబంధించి బాలాసోర్ ప్రభుత్వ రైల్వే పోలీసు(జీఆర్‌పీఎస్)లో నమోదు చేసిన కేసులో దర్యాప్తు చేపట్టిందన్నారు.

సీఆర్ఎస్ విచారణ..

రైలు దుర్ఘటనలో ప్రాణహాని సంభవించే పరిస్థితుల్లో రైల్వే భద్రతా కమిషనర్(సీఆర్ఎస్) దర్యాప్తు చేపట్టడం నిబంధన. ఈ నేపథ్యంలో ఇటీవల బహనాఘా బజార్ రైల్వే స్టేషన్‌లో జరిగిన ట్రిపుల్ రైలు దుర్ఘటనలో మృతులు సంభవించిన ఘటనపై సీఆర్ఎస్ విచారణ కోసం రంగంలోకి దిగింది. ఘటనా స్థలంలో ప్రత్యక్షంగా సందర్శించిన అనుబంధ అధికార, సిబ్బంది వర్గాలతో ముఖాముఖి సంప్రదించింది. ఆదివారం ప్రమాద స్థలాన్ని సందర్శించిన రైల్వే భద్రతా కమిషనర్ శైలేష్‌కుమార్ పాఠక్.. కొంతమంది వ్యక్తుల వాంగ్మూలం నమోదు చేశారు. ఇదిలా ఉండగా ఇదో ఉద్దేశపూర్వక ట్యాంపరింగ్ సంఘటనగా ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ రింకేష్‌రాయ్ మీడియాతో అన్నారు. ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్‌లో మార్పు కారణంగా రైలుప్రమాదం సంభవించిందని.. అయితే ప్రమాదానికి గురైన రైళ్లలో ఒకటైన చెన్నైకి వెళ్లే కోరమండల్ ఎక్స్‌ప్రెస్ లోకోపైలట్(ఎల్‌పీ), అసిస్టెంట్ లోకోపైలట్ వివరణ ప్రకారం గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లు వెల్లడైందన్నారు. ఈ ఘటనకు వీరివురు ప్రత్యక్ష సాక్షులు. ఈ పరిస్థితుల దృష్ట్యా సిగ్నలింగ్ వ్యవస్థలో 'ఉద్దేశపూర్వకంగా ట్యాంపరింగ్' ఉండవచ్చని డీఆర్ఎం సందేహం వ్యక్తంచేశారు. ఈ ఘటనపై సీబీఐ విచారణకు రైల్వేబోర్డు ఆదివారం సిఫార్సు చేసిన విషయం తెలిసిందే. పరిస్థితులు, పరిసరాలు, నిర్వహణ ఇతరేతర అనుబంధ వర్గాల నుంచి అందిన సమాచారాన్ని పరిగణలోకి తీసుకుని రైల్వేబోర్డు తదుపరి విచారణ, దర్యాప్తు కోసం సీబీఐ విచారణకు సిఫార్సు చేసినట్లు రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్ ఆదివారం స్పష్టం చేశారు. ఈ ఘటనలో 21 కోచ్‌లు ఢీకొని పట్టాలు తప్పడంతో 288 మృతులు నమోదయ్యాయి. వెయ్యి మందికి పైగా గాయపడ్డారు.

సమ్మతించిన రాష్ట్రప్రభుత్వం

రైలు ప్రమాదంపై సీబీఐ విచారణకు ఒడిశా ప్రభుత్వం సమ్మతి తెలిపింది. సీబీఐ విచారణకు రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి సంతకం చేసిన సమ్మతి లేఖ జారీ చేశారు. ఈనెల 2న బహనాగా బజార్‌లో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాదానికి దారితీసిన కారణాలపై సీబీఐ విచారణకు ఒడిశా ప్రభుత్వం తరఫున అదనపు చీఫ్ సెక్రటరీ(హోమ్) డీకే సింగ్ సమ్మతి తెలిపారు. ఈ ప్రమాదం యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్‌లోని 2 కోచ్‌లను కూడా ప్రభావితం చేసింది.

గుర్తించాల్సినవి.. 83

బహనాగా బజార్ స్టేషన్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటనలో మృతుల సంఖ్యలో హెచ్చుతగ్గులు చోటు చేసుకోవడంతో గందరగోళం నెలకొంది. మృతుల జాబితా విస్తృత ధ్రువీకరణ, అనుబంధ వర్గాల సమాచారం, ఘటనా స్థలం ఇతరేతర రంగాల్లో 2రౌండ్ల కూంబింగ్ నిర్వహించిన అనంతరం 288మరణాలను నిర్ధారించినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్ జెనా మంగళవారం సాయంత్రం వెల్లడించారు. 205 మృతదేహాలను గుర్తించి బంధువర్గాలకు అప్పగించగా, మరో 83 ఇంకా గుర్తించాల్సి ఉందన్నారు. భువనేశ్వర్‌లో 110, బాలాసోర్‌లో 94, భద్రక్‌లో 1 గుర్తించని వాటిలో ఉన్నాయి. పలు ప్రాంతాలకు మృత దేహాలను ప్రభుత్వ ఖర్చులతో తరలించారు. అయితే గుర్తించని మృతదేహాల్లో పలు సందర్భాల్లో వివాదం తలెత్తుతోంది. ఒక్కో మృతదేహం కోసం ఒకరి కంటే ఎక్కువ మంది ముందుకు రావడంతో ఈ పరిస్థితి నెలకొంటుంది. వివాదం నుంచి బయట పడేందుకు సందిగ్ధ 83 మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో అనుబంధ వర్గాల నుంచి సహాయ, సహకారాలు అభ్యర్థించారు.

రాష్ట్ర మృతులు 39..

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటనలో రాష్ట్రం నుంచి 39మంది ప్రయాణికులు మృతిచెందారు. వీరిలో బాలాసోర్ జిల్లా నుంచి 14, మయూర్‌భంజ్ 9, భద్రక్ 8, కటక్ 3, జాజ్‌పూర్ 2, ఖుర్దా 2, కెంజొహర్ జిల్లా నుంచి ఒకరు మృతి చెందినట్లు ఖరారు చేశారు. ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటన మేరకు మృతుల కుటుంబీకులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1.95 కోట్ల పరిహారం మంజూరు చేశారు. ఒక్కో మృతుని కుటుంబానికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన విషయం తెలిసిందే.

బాధితులకు సాయం..



రైలు ప్రమాద బాధితుల సహాయార్థం ఒడిశా వెటర్నరీ సర్వీసెస్ అసోసియేషన్ రూ.20 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించింది. అసోసియేషన్ సభ్యులు ప్రత్యేక సహాయ కమిషనర్ కార్యాలయంలో చీఫ్ సెక్రటరీ ప్రదీప్‌కుమార్ జెనాకు దీనికి సంబంధించిన చెక్కును అందజేశారు.

సచివాలయ సేవాసంఘం..



బాధితుల సహాయార్థం రాష్ట్ర సచివాలయ సేవాసంఘం రూ. 2.50 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి అందించారు. ఈ మేరకు సేవాసంఘం సభ్యుల బృందం ప్రత్యేక సహాయ కమిషనర్ కార్యాలయంలో సీఎస్ ప్రదీప్ జెనాతో భేటీ అయ్యారు.

మృతుల గుర్తింపు చర్యలు ముమ్మరం

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు దుర్ఘటనలో మృతుల గుర్తింపు చర్యలు ముమ్మరం చేస్తున్నారు. మృతుల బంధువులు, ఆత్మీయులు సులువుగా గుర్తించేందుకు పలు రకాల సన్నాహాలు చేశారు. ఈ చర్యలు అంతంత మాత్రంగా ఫలప్రదమయ్యాయి. ఇదిలా ఉండగా మృతదేహాల కోసం పలువురు ముందుకు రావడంతో పరిస్థితి మరింత బిగుసుకుంది. ఈ నేపథ్యంలో మృతదేహాలను దీర్ఘకాలం తాజాగా ఉంచేందుకు శక్తివంతమైన కంటైనర్లు వంటి సాంకేతిక సదుపాయాలతో మృతుల వివరాలు ప్రదర్శన వంటి సన్నాహాలు చేపట్టారు. వీటిపై వివాదం తలెత్తడంతో మృతులు, బంధువర్గాల డీఎన్ఏ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు స్థానిక అఖిల భారత వైద్యవిజ్ఞాన సంస్థ(ఎయిమ్స్) ప్రాంగణంలో డీఎన్ఏ పరీక్షల కేంద్రం ఏర్పాటు చేశారు. 10మంది వ్యక్తులు డీఎన్ఏ పరీక్షలకు ముందుకు వచ్చారు. వీరిలో 5మంది పరీక్షలు పూర్తి చేసినట్లు అనుబంధ వర్గాలు తెలిపాయి.

ఎస్సీబీని సందర్శించిన మమతా బెనర్జీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ

- రైలు దుర్ఘటన నిజం నిగ్గు తేలాల్సిందే



ఎస్సీబీ ఆస్పత్రి సందర్శనలో మమతా బెనర్జీ

భువనేశ్వర్: రాష్ట్రంలో 288మంది ప్రాణాలను బలిగొన్న ట్రిపుల్ రైలు ప్రమాదంలో నిజానిజాలు బయటకు రావాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అభిప్రాయం వ్యక్తంచేశారు. కటక్ ఎస్సీబీ వైద్య బోధనాస్పత్రి సందర్శన పురస్కరించుకుని ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బెంగాల్ బాధిత యాత్రికులను పరామర్శించారు. చికిత్స కల్పిస్తున్న వైద్య బృందాలతో సంప్రదించారు. ఒడిశా రైలు దుర్ఘటన వెనక తృణమూల్ కాంగ్రెస్ హస్తం ఉందని పశ్చిమబెంగాల్ ప్రతిపక్ష నాయకుడు సువేంధు అధికారి చేసిన ఆరోపణ పట్ల మమత బెనర్జీ స్పందించారు. 'రాజకీయాలకు ఇది సమయం కాదు. బాధితులు త్వరగా ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించాల్సిన సమయం'గా పేర్కొన్నారు. చాలామంది ప్రాణాలు పోయినందున దుర్ఘటన పూర్వాపరాల వెనక దాగి ఉన్న సత్యాన్ని అణచివేయకూడదన్నారు. 'ఇది వాదోపవాదాలకు సమయం కాదు.. మేము ప్రజలకు సహాయం చేయాలనుకుంటున్నా'మని తెలిపారు. ఈ విషయంలో ఒడిశా, బెంగాల్ ప్రభుత్వాలు రెండూ కలిసి పని చేస్తున్నాయని, బాధితులకు ఉచిత చికిత్స అందిస్తున్నాయని గుర్తుచేశారు. ఇదిలా ఉండా.. పశ్చిమబెంగాల్‌కు చెందిన 103 మృతదేహాలను గుర్తించారు. మరో 97మంది చికిత్స పొందుతున్నారు. తమ రాష్ట్రానికి చెందిన 31మంది ఆచూకీ లభించ లేదని ఆమె వాపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల పరామర్శ పురస్కరించుకుని నేత్ర చికిత్స మరియు శస్త్రచికిత్స విభాగాలకు వెళ్లి రోగులతో సంభాషించారు. వారికి అన్ని విధాలుగా సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 2న ప్రమాదం జరిగిన రాత్రి గాయపడిన ప్రయాణికులను జాగ్రత్తగా చూసుకొనేందుకు వైద్యులు, నర్సులు, అధికారుల బృందాలను ఇప్పటికే పంపించినట్లు పశ్చిమ బెంగాల్ సీఎం తెలిపారు. బెంగాల్‌కు చెందిన 57 మంది గాయపడిన ప్రయాణికులు ఎస్‌సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొందరు పలు అవయవాలు, మరికొందరు కళ్లు కోల్పోయారు. ఇది మాటలతో వర్ణించలేని విషాదమని ఆమె విచారం వ్యక్తం చేశారు.

ఎస్సీబీలో ఎల్ఈడీ ప్రదర్శన





కటక్ ఎస్సీబీ ఎంసీహెచ్ ఆవరణలో ప్రదర్శిస్తున్న బాధితుల ఫొటోలు

కటక్ ఎస్సీబీ వైద్య బోధన ఆస్పత్రి ప్రాంగణంలో ఎల్ఈడీ టీవీ ప్రదర్శన ప్రారంభించారు. ఈ ప్రాంగణంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో హెల్ప్‌డెస్క్, సమాచార కేంద్రాలు పని చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఎవరూ గుర్తించని బాధితుల బంధు వర్గాలు ముందుకు వచ్చేందుకు వీలుగా ఆస్పత్రి ఆవరణలో చికిత్స పొందుతున్న వారి ఫొటోలను ఎల్ఈడీ టీవీలో ప్రదర్శిస్తున్నారు. బాధితుల వివరాలతో సమగ్ర జాబితా ఈ ప్రదర్శనలో లభ్యమవుతోంది.

పరిహారం పొందడం ఇలా..

ఈనెల 2న బాలాసోర్ జిల్లా బహనాగా బజార్ రైల్వేస్టేషన్‌లో జరిగిన రైలు ప్రమాదంలో మరణించిన గాయపడిన వ్యక్తుల కుటుంబాలకు రైల్వేశాఖ నష్టపరిహారం ప్రకటించింది. వాస్తవ బాధిత, పీడిత వర్గాలు ఈ పరిహారం లబ్ధిదారులు. పరిహారం పొందేందుకు దశలవారీ క్రమ విధానం ఇలా ఉంది. మృతులు, గాయపడిన వారు, గుర్తు తెలియని మృతదేహాల చిత్రాలతో కూడిన వెబ్‌సైట్ల లింక్‌లను రైల్వేశాఖ విడుదల చేసింది. మృతదేహాలను ఉంచిన ఆస్పత్రులు, చికిత్స పొందుతున్న, గాయపడిన వ్యక్తుల పేర్లు, చిరునామాలను కూడా ఈ సైట్‌లో పేర్కొంటాయి. రైల్వేశాఖ మృతుల కుటుంబీకులకు రూ.10 లక్షల పరిహారం చెల్లిస్తుంది. ఈ మొత్తంలో రూ.50వేల నగదు, రూ.9.5 లక్షల చెక్కు అందిస్తారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం పంపిణీ చేస్తారు.

వెబ్‌పోర్టల్ వివరాలు:

- ఘోర ప్రమాదంలో మరణించిన వ్యక్తుల చిత్రాలను https://srcodisha.nic.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- వివిధ ఆస్పత్రులలో చికిత్స పొందుతున్న, గాయపడిన ప్రయాణికుల పేర్లను తెలుసుకునేందుకు https://www.bmc.gov.in
- కటక్ ఎస్సీబీ మెడికల్ కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తుల ఫొటోల వివరాలు ఈ క్రింది వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.
- https://www.bmc.gov.in/train&accident/download/Un&identified&person&under&treatment&atSCB&Cuttack.pdf
- ప్రభావిత వర్గలు ప్రటకించిన నష్టపరిహారం పొందేందుకు క్రమ పద్ధతిలో అనుబంధ వర్గాలను సంప్రదించాల్సి ఉంది.
- తొలుత మృతదేహం భద్రపరిచిన ఆస్పత్రిని సంప్రదించాలి. ఈ మేరకు రైల్వేశాఖ జారీ చేసిన జాబితాను పరిగణలోకి తీసుకోవాలి.
- బాధితులతో తమ సంబంధాన్ని ధ్రువీకరించే పత్రాలు దాఖలు చేయాలి.
- అభ్యర్థన మేరకు దాఖలు చేసిన పత్రాలను పరిశీలించిన మేరకు ధ్రువీకరించిన తరువాత మృతదేహాన్ని అప్పగిస్తారు.
- ఈ సందర్భంగా ఆస్పత్రి అధికారులు డిశ్చార్జి సర్టిఫికెట్ జారీ చేస్తారు.
- తదుపరి పరిహారం పొందేందుకు డిశ్చార్జ్ సర్టిఫికెట్‌తో పాటు అవసరమైన దరఖాస్తు దాఖలు చేయాల్సి ఉంటుంది.
- మృతుల రక్త సంబంధీకులకు మాత్రమే పరిహారం చెల్లిస్తారు. వివాహిత జంట(దంపతులు) విషయంలో భర్త లేదా భార్యకు మాత్రమే పరిహారం ముడుతుంది.

రైల్వే సిబ్బంది ప్రస్తావన లేదు: సీబీఐ

288 మంది మృతికి కారణమైన బాలాసోర్ రైలు ప్రమాదంలో నమోదైన ఎఫ్ఐఆర్ వివరాలను సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్(సీబీఐ) లోతుగా పరిశీలించినట్లు మంగళవారం తెలిపింది. ఎఫ్ఐఆర్ దాఖలు సమయానికి నిర్దిష్ట రైల్వే ఉద్యోగుల నేరం నిర్ధారించలేదు. తదుపరి దర్యాప్తు సమయంలో ఈ అంశం నిర్ధారిస్తామని పేర్కొంది. కటక్ ఓపీఎస్ ఎస్‌డీఆర్‌పీఓ రంజిత్ నాయక్ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో ఈ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

ఛత్రపూర్‌లో రాష్ట్రస్థాయి హాకీ లీగ్ పోటీలు

- ప్రారంభించిన భారత హాకీ సమాఖ్య అధ్యక్షుడు దిలీప్ టిర్కీ



లీగ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఐహెచ్‌ఎఫ్ అధ్యక్షుడు దిలీప్ టిర్కీ



హాకీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దిలీప్ టిర్కీ

బరంపురం: జిల్లా కేంద్రం ఛత్రపూర్ పోలీస్ రిజర్వ్ మైదానంలో టాటా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాకీ లీగ్ రాష్ట్రస్థాయి పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భారత హాకీ జట్టు మాజీ కెప్టెన్, భారత హాకీ సమాఖ్య(ఐహెచ్‌ఎఫ్) అధ్యక్షుడు దిలీప్ టిర్కీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి పాల్గొన్న క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం హాకీని ప్రోత్సహించేందుకు ఎంతో కృషి చేస్తోందన్నారు. క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. వీటిని సద్వినియోగంచుకోవాలని సూచించారు.

రాయగడలో మామిడి మేళ



మామిడిపండ్లు కొనుగోలు చేస్తున్న వినియోగదారులు



మామిడి ప్రియులను ఆహ్వానిస్తున్న మేళాద్వారం

రాయగడ: పట్టణంలోని తేజస్వి మైదానంలో ఒర్మాస్, జిల్లా యంత్రాంగం సంయుక్తంగా మామిడి పండ్ల మేళా మంగళవారం నిర్వహించారు. కలెక్టర్ స్వాధాదేవ్ సింగ్ ముఖ్య అతిథిగా హాజరై, దీనిని ప్రారంభించారు. జిల్లాలోని కాసీపూర్, బిసంకటక్ సమితులలో విరివిగా పండే వివిధ రకాల మామిడి పండ్లను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో పండే మామిడికి మంచి గిరాకీ ఉంటుందని, భువనేశ్వర్, ఢిల్లీ, విశాఖపట్నం తదితర ప్రాంతాలకు ఇక్కడి వాటిని ఎగుమతి చేస్తుంటారని కలెక్టర్ తెలిపారు. స్థానిక రైతులు పండించే పంటను ఒకే ప్రదేశంలో విక్రయించేందుకు వీలుగా మేళా ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది సాగు ఆశాజనకంగా ఉందని పేర్కొన్నారు. ఈనెల 10వరకు కొనసాగనున్న ఈ మేళాలో 15 స్టాల్‌లు ఏర్పాటు చేశారు. అలాగే మామిడితో తయారయ్యే తాండ్ర, ఊరగాయలు, పండ్ల రసాలు విక్రయాలకు ఉంచారు. కార్యక్రమంలో ఒర్మాస్ డిప్యూటీ డైరెక్టర్ మనోజ్ పాత్రొ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

కాపాడబోయి.. కానరానిలోకాలకు..

- వంశధార కాలువలో మునిగి డిగ్రీ విద్యార్థి మృతి


మృతిచెందిన వెంకటరమణ

కోటబొమ్మాళి: వంశధార కాలువలో స్నానానికి దిగిన ఇద్దరు చిన్నారులు ఈతరాక మునిగిపోతుండగా కాపాడేందుకు వెళ్లిన డిగ్రీ విద్యార్థి మృత్యువాతపడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కోటబొమ్మాళి మండలం పొడుగుపాడు గ్రామానికి చెందిన బొడ్డేపల్లి రామారావు పెద్ద కుమారుడు వెంకటరమణ(20) డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు. మంగళవారం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామం పక్కనే ఉన్న వంశధార ఎడమ కాలువ వద్దకు వెళ్లారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన పదేళ్ల వయసు గల ఇద్దరు చిన్నారులు స్నానం చేసేందుకు కాలువలో దిగారు. ఈత రాకపోవడంతో మునిగిపోతూ కేకలు వేశారు. పరిస్థితిని గమనించిన వెంకటరమణ వెంటనే కాలువలోకి దూకి ఇద్దరినీ భుజంపై వేసుకుని ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేశాడు. అంతలోనే చిన్నారుల బరువును మోయలేక కాలువ బురదలో చిక్కుకొని మునిగిపోయాడు. ఇంతలో అటుగా వచ్చిన గ్రామస్తులు ఇద్దరు చిన్నారులను రక్షించి, మునిగిన వెంకటరమణను బయటకు తీశారు. స్పృహ కోల్పోయిన వెంకటరమణను కోటబొమ్మాళి ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు.

పీజీ సెట్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాలు, అఫిలియేషన్ కళాశాలల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ఏపీ పీజీసెట్- 2023 ప్రవేశ పరీక్షలు మంగళవారం రెండు కేంద్రాల్లో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఎచ్చెర్ల శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 53 మంది, రెండో షిఫ్టులో 87 మంది, మూడో షిఫ్టులో 72 మంది హాజరయ్యారు. చిలకపాలెం శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఒకే షిఫ్టులో 110 మంది హాజరయ్యారు. ఈ నెల 10 వరకు పరీక్షలు జరగనున్నాయి.

11వ శతాబ్దం నాటి శిలాశాసనం పరిశీలన


శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న శివనాగిరెడ్డి బృందం

పోలాకి: మండలంలోని దీర్ఘాశి గ్రామంలో 11వ శతాబ్దానికి చెందిన శిలా శాసనాన్ని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ శివనాగిరెడ్డి తన బృందంతో కలిసి మంగళవారం పరిశీలించారు. భగవతి అమ్మవారి ఆలయం, జగన్నాథస్వామి ఆలయంతోపాటు క్రీ.శ.1075లో ఏర్పాటు చేసిన గణపతి శాసనాన్ని గతంలో తెలుగులోకి అనువదించిన విషయాన్ని స్థానికులు అశోక్‌కుమార్, పి.వి.ఎస్.ఎన్.మూర్తి అధికారులకు వివరించారు. అనువాద పాఠాన్ని శిలాశాసనం వద్ద ఏర్పాటుచేసి పర్యాటకంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖాధికారి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


అశుతోష్ పాండేకు మొక్క అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. పర్యావరణ పరిరక్షణ, దేశ రక్షణ కోసం పది వేల కిలోమీటర్లు దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన అశుతోష్ పాండే మంగళవారం శ్రీకాకుళం చేరుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయన్ను అభినందించి మొక్కను అందజేశారు. పాదయాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఏడుగురు ఎస్‌ఐలకు స్థాన చలనం

శ్రీకాకుళం క్రైమ్ : విశాఖపట్నం రేంజి కార్యాలయం ఉత్తర్వుల మేరకు జిల్లాలో ఏడుగురు ఎస్‌ఐలకు స్థానచలనం చేస్తూ ఎస్పీ కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం వీఆర్‌లో ఉన్న వి.నేతాజీ, వి.వెంకటరావు, షేక్ ఖాదర్ బాషా, ఎం.డి.హసీన్, కె.వెంకటేష్(ట్రాఫిక్ పీఎస్ అటాచ్డ్)లను శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ-2, కాశీబుగ్గ, పాతపట్నం, శ్రీకాకుళం ట్రాఫిక్ పీఎస్‌లకు బదిలీ చేశారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ ఎస్‌ఐ-2, పాతపట్నం పీఎస్‌ల్లో ఉన్న మొజ్జాడ ప్రవల్లిక, జి.ప్రభాకరరావులను శ్రీకాకుళం వీఆర్, శ్రీకాకుళం డీపీటీసీలకు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కన్నవారింటి నుంచి
అమ్మవారికి పిలుపు

- ముగిసిన ఉత్సవ ప్రధాన ఘట్టాలు
- బుధవారంతో బురదల పోలమ్మ సంబరాలు పూర్తి


పాలజంగిడితో వెళ్తున్న పూజారి

రాయగడ: గ్రామదేవత బురదల పోలమ్మ ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తొలి అసర్లు ఘట్టం ముగిసింది. మశూచి మహమ్మారి నుంచి గ్రామ ప్రజలను కాపాడిన బురదల పోలమ్మను సంబరాలు చేసేందుకు ప్రజలు ఆహ్వానించారు. ఈ క్రమంలో ప్రజల కోరిక మేరకు సంబరాలను ఆస్వాదించేందుకు అమ్మవారు ఉత్సవ వేదిక వద్దకు కన్నవారి ఇంటి నుంచి తరలివచ్చారు. అయితే ఇంటి నుంచి వెళ్లిన అమ్మవారిని తిరిగి ఇంటికి రమ్మని కన్నవారు పిలిచారు. దీనినే అసర్లుగా భావిస్తారు. కన్నవారి తరుపున దొరల వంశానికి చెందిన యువకులు ప్రత్యేకంగా అలంకరించుకుని నోట్లో అగ్గి దివిటీలను పట్టుకుని ఉత్సవ వేదిక వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రతిరూపంగా కొలిచే పూజారి, పూజారమ్మలు ఎదురుగా వెళ్లి, కన్నవారి పిలపునకు సుముఖత వ్యక్తంచేశారు. అయితే మరో 2రోజులు సంబరాలు జరుపుకొని, ఇంటికి తిరిగి వస్తానని కన్నవారితో అమ్మవారు నచ్చజెప్పడంతో తిరిగి కన్నవారు వెళ్లిపోతారు. రసవత్తరంగా సాగే ఈ ఘట్టాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

విత్తనాలు తీసుకువచ్చుట..

అసర్ల ఘట్టం ముగిసిన అనంతరం గ్రామ ప్రజలు తమ పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం శుభిక్షంగా ఉండేలా అమ్మవారు కరుణించాలని కోరారు. దీనికి అమ్మవారు సంతోషించి విత్తనాలు తీసుకు రావాలని గ్రామంలోని నాయుడు, నాయురాళ్లను ఆదేశించారు. ఈ క్రమంలో విత్తనాలను తీసుకు రాగా, అమ్మవారి ముందు నిలుపగా.. ఈ విత్తనాలను వేసి, పంటలు పండించడంతో అంతా సుఖశాంతులతో ఉండాలని ఆశీర్వదించారు. ఈ ఘట్టాన్ని సంప్రదాయంగా కొనసాగించారు. నాయుడు, నాయురాళ్ల వేషధారణలో బార్జి శారద, బార్జి నిఖిల్ ఈ ఘట్టాన్ని నిర్వహించారు.

ఆకట్టుకున్న కోలాటం

ఉత్సవాల్లో భాగంగా స్థానిక కల్యాణ వేంకటేశ్వర మందిరానికి చెందిన కోలాటం బృందం ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్విరామంగా గంట సమయం ఈ కోలాట ప్రదర్శన జరిగింది.

ముగింపు ఉత్సవాలకు సన్నాహాలు..

గత 9రోజులుగా కొనసాగుతున్న అమ్మవారి ఉత్సవాలు బుధవారంతో ముగియనున్నాయి. ముగింపు ఉత్సవాలను తిలకించేందుకు, మొక్కుబడులు తీర్చుకునేందుకు దాదాపు లక్ష మందికి పైగా భక్తులు వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వారికి అవసరమయ్యే తాగునీటి సౌకర్యాన్ని ఉత్సవాలు జరిగే ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు కమిటీ సన్నాహాలు చేస్తోంది. అదేవిధంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నిమజ్జనోత్సవాల్లో భాగంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు భారీ వాహనాల పట్టణంలోకి రాకుండా నిలువరించారు.


నాయుడు, నాయురాళ్ల వేషధారణలు


ఆకట్టుకుంటున్న మహిళల కోలాటం


కన్నవారి ఇంటి నుంచి పిలుపులకు వచ్చిన దొరలు(యువకులు)

చిత్రాల్లో దేవుళ్ల దర్శనం

- తెరమరుగున రాజవైద్యుల చికిత్స పొందుతున్న జగన్నాథుడు


యజ్ఞసేని(దేవీ సుభద్ర ప్రతిరూపం)


వాసు దేవుడు(బలభద్రుని ప్రతిరూపం)


నారాయణుడు(జగన్నాథుని ప్రతిరూపం)

భువనేశ్వర్: జగన్నాథుని భక్తులకు నిత్యదర్శనం ప్రాప్తిస్తుంది. ఆలయ ఆచార వ్యవహారాలకు పట్టం గడుతూ వచ్చిపోయే భక్తులు, యాత్రికులకు ఏమాత్రం అసంతృప్తి లేకుండా స్వామి ఏదో ఒక రూపంలో దర్శనమిస్తూ సంతృప్తి పరచడం శ్రీక్షేత్రంలో నెలకొన్న జగన్నాథుని సందర్శనలో విశిష్టత. జ్యేష్ఠ పౌర్ణమి పురస్కరించుకుని స్వామి అష్టోత్తర శత కలశాలతో భారీస్నానం ఆచరించడంతో అనారోగ్యం పాలై, తెరమరుగుయ్యాడు. తెరచాటున రాజవైద్యుల ప్రత్యక్ష పర్యవేక్షణలో పౌర్ణమి నుంచి పక్షం రోజులు నిరవధికంగా వైద్య ఉపచారాలు పొందడంతో సామాన్య భక్త జనానికి స్వామి మూలవిరాట్ కనుమరుగువుతోంది. అయితే శ్రీమందిరాన్ని సందర్శించిన భక్తులు, యాత్రికులకు చిత్రపటాల్లో మూలవిరాట్‌ల ప్రతిరూపాలు దర్శనానికి అందుబాటులో ఉండటం విశేషం.

పొట్ట చిత్రాల దేవుళ్లు..

భక్తులకు దర్శనం ఇచ్చేందుకు శ్రీమందిరంలో పొట్టా చిత్రాల దేవుళ్లు పూజలందుకుంటున్నారు. స్థానిక సంప్రదాయ రీతుల్లో అత్యంత నియమ నిష్ఠలతో చిత్రకారులు, రూపకారుల సేవావర్గాల ప్రతినిధులు ఈ చిత్ర దేవుళ్లను సిద్ధం చేస్తారు. స్నాన పూర్ణిమ ముగియడంతో మర్నాటి నుంచి శ్రీమందిరంలో ఈ దేవుళ్ల దర్శనం సాధారణ భక్తులకు లభించేందుకు సిద్ధం చేస్తారు. ఈ క్రమంలో శ్రీమందిరం సింహద్వారం ఆవరణలో పతిత పావనుని(జగన్నాథుడు) ప్రధానమూర్తి తెర మరుగవుతుంది. ఈ స్థానంలో పొట్టా చిత్రం ఏర్పాటై నిత్య ప్రాతఃకాల సేవాదులు అందుకుంటుంది. శ్రీమందిరం రత్నవేదికపై మూలవిరాట్‌లకు నిత్యం జరిగే పూజాదులను క్రమ పద్ధతిలో చిత్ర దేవుళ్లకు నిర్వహిస్తారు.

మూలవిరాట్‌ల ప్రతిరూపాలు..

బలభద్రుని ప్రతిరూపంగా వాసుదేవుని చిత్రం, దేవీ సుభద్ర స్థానంలో యజ్ఞసేని లేదా భువనేశ్వరి ప్రతిరూపం, జగన్నాథుని ప్రతినిధిగా నారాయణుని పొట్టా చిత్రాలు దర్శనం ఇస్తున్నాయి. ఈ చిత్రాల్లో త్రిమూర్తులు పద్మాసనంలో చతుర్భుజాలతో సాక్షాత్కరిస్తాయి. శ్వేత వర్ణంలో బలభద్ర స్వామి ప్రతినిధిగా వాసుదేవుడు చతుర్భుజాల్లో శంఖం, చక్రం, గద, నాగలి ధరించగా శ్యామల వర్ణంలో జగన్నాథుని ప్రతిమూర్తిగా నారాయణుడు చతుర్భుజాల్లో శంఖం, చక్రం, గద, పద్మం ధరించి కళకళలాడుతున్నారు. పసుపు పచ్చని ముఖ ఛాయతో యజ్ఞసేని రూపంలో దేవీ సుభద్ర ఉభయ హస్తాల్లో పద్మాలు, వరద ముద్రలో రెండు నిమ్న హస్తాలు చిత్రీకరణతో దర్శనమిస్తున్నాయి.

వికటించిన మాత్రలు!


బాలుడి మృతదేహంతో రస్తారోకో చేపడుతున్న గ్రామస్తులు

- కాలంచెల్లిన మందులు వేయడంతో 11నెలల చిన్నారి మృతి

పర్లాకిమిడి: ప్రభుత్వ మందుల దుకాణంలో కాలం చెల్లిన మందులు ఇవ్వడంతో 11 నెలల చిన్నారి మృతిచెందింది. దీంతో జాజిపూర్ గ్రామస్తులు ఆందోళనకు దిగారు. దీంతో పర్లాకిమిడి నుంచి మోహానా, ఆర్.ఉదయగిరి, చంద్రగిరి, రాయఘడ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గుసాని సమితి జాజిపూర్ గ్రామానికి చెందిన ఉపేంద్ర సైసా కుమారుడు 10నెలల సచిత్ సైసా బరువు తక్కువగా ఉన్నాడని ఏప్రిల్ 7న పర్లాకిమిడి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. అక్కడ తనిఖీ చేసిన వైద్యులు.. ఉచితంగా మందులు అందజేశారు. ఇంటికి వచ్చిన అనంతరం మందులు వేయగా.. చిన్నారి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో పర్లాకిమిడి వైద్యులు సిఫార్సు మేరకు శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి, అక్కడి నుంచి కటక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఈ మేరకు మృతదేహానికి స్వగ్రామానికి తరలించగా.. ఆగ్రహం వ్యక్తం చేసిన బాధిత కుటుంబ సభ్యులు రోడ్డుపైనే ఆందోళనకు దిగారు. కాలం చెల్లిన మందులు పంపిణీ చేయడం వల్లే చిన్నారి మృతి చెందినట్లు ఆరోపించారు. దీనికి బాధ్యులైన వారికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రస్తారోకోతో పర్లాకిమిడి, రాయఘడ, ఆర్.ఉదయగిరి మార్గంలో దాదాపు గంటకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఆదర్శ పోలీస్ స్టేషన్ ఐఐసీ బబులీ నాయక్, తహసీల్దార్ నారాయణ బెహరా, అదనపు తహసీల్దార్ బిపిన్ లిమ్మా ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులకు నచ్చజెప్పి, ఆందోళన విరమింపజేశారు.

రాయగడలో మంత్రి సవ్యసాచి పర్యటన


బిజూ పట్నాయక్ ఆడిటోరియం

- వివిధ అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం


ఆడిటోరియంను ప్రారంభిస్తున్న మంత్రులు నాయక్, సరక, పక్కన నెక్కంటి

రాయగడ: రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి, జిల్లా ప్రణాళిక మండలి అధ్యక్షుడు అతున్ సవ్యసాచి నాయక్ జిల్లాలో మంగళవారం పర్యటించారు. జిల్లాలోని బిసంకటక్, గుణుపూర్‌లో పర్యటించిన అనంతరం ఆయన రాయగడ చేరుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సుమారు 8.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆడిటోరియంను ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆదివాసీ, హరిజన సంక్షేమశాఖ మంత్రి జగన్నాథ సరక, రాజ్యసభ మాజీ ఎంపీ నెక్కంటి భాస్కరరావు, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్, రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి, జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ, మున్సిపాలిటీ చైర్మన్ మహేష్ పట్నాయక్, వైస్ చైర్మన్ శుభ్ర పండా తదితరులు పాల్గొన్నారు. బిజూ పట్నాయక్ పేరిట ప్రారంభించిన ఈ ఆడిటోరియంలో 545మంది కూర్చునే సౌకర్యంతో పాటు సెంట్రల్ ఏసీతో నిర్మించారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న రాయగడ పట్టణ ప్రజలకు ఇది మరెంతో ఉపయోగ పడుతుందని మంత్రి తెలిపారు.

మిషన్‌శక్తి కేఫ్ ప్రారంభం..

జిల్లా కేంద్ర ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వచ్చిన రోగి సహాయకులకు తక్కువ ధరకే అల్పాహారం, భోజన సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన అమో హాస్పటల్ మిషన్‌శక్తి కేఫ్(భోజన శాల)ను మంత్రి నాయక్ ప్రారంభించారు. మా మంగళ స్వయం సహాయక బృందానికి చెందిన మహిళా బృందానికి ఈ భోజనశాల పరివేక్షణను అప్పగించారు. అన్నం, పప్పు, కాయగూర, పచ్చడితో రూ.45 లకు పుష్టికరమైన భోజనాన్ని వీరు రోగులతో వచ్చిన సహాయకులకు అందిస్తారు. ఒకేసారి 45మంది కూర్చుని భోజనం చేసే సౌకర్యాన్ని ఇందులో ఏర్పాటు చేశారు. అదేవిధంగాపై అంతస్తులో వారికి విశ్రాంతి గది కూడా తక్కువ ధర చెల్లించి వినియోగించే అవకాశం కూడా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయం సహాయక బృందానికి చెందిన మహిళలతో మాట్లాడారు. మహిళల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధితో పాటు వారి స్వావలంబనకు ప్రభుత్వం ఇటువంటి తరహా కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుందని, సద్వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీఎంఓ లాల్‌మోహన్ రౌత్రాయ్, డీపీఎం పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


స్వయం సహాయక బృందాల మహిళలతో మాట్లాడుతున్న మంత్రి సవ్యసాచి నాయక్

వ్యాపారిపై రౌడీయిజం

- తండ్రీ ముగ్గురు కొడుకులను అరెస్ట్ చేసిన పోలీసులు


పోలీసుల అదుపులో తండ్రీ కొడుకులు

బరంపురం: నగరానికి చెందిన ఓ వ్యాపారిపై దౌర్జన్యం చేయడంతో పాటు డబ్బులు చేస్తున్నారనే ఆరోపణలపై తండ్రీ, అతని ముగ్గురు కొడుకులను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఏఎస్పీ ప్రభత్‌కుమార్ రౌత్రాయ్ తెలిపిన వివరాల ప్రకారం నిమ్మఖండి పోలీసు స్టేషన్ పరిధి లుచ్చాపడా గ్రామానికి చెందిన చెరుకు వ్యాపారిని అదే గ్రామానికి చెందిన వ్యక్తులు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితులను అరెస్ట్ చేశారు. వీరిలో తండ్రి బజరామ్ మెహర్, కుమారులు కార్తీక్, సత్యనారాయణ, గోపాలకృష్ణగా గుర్తించారు.

కొనసాగుతున్న శిబిరాలు


శిబిరంలో రక్తం అందిస్తున్న దాతలు

- రైలు ప్రమాద క్షతగాత్రులకు అండగా 107యూనిట్ల రక్తం సేకరణ



రక్తదానం చేస్తున్న ఎస్ఆర్‌మాల్ యజమాని

జయపురం: బాలేశ్వర్ జిల్లాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల సహాయార్థం వివిధ సంస్థలు రక్తదాన శిబిరాలు కొనసాగిస్తున్నాయి. జయపురానికి చెందిన ఎస్ఆర్ మాల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శిబిరంలో సిబ్బంది రక్తదానం చేశారు. అలాగే మృతులకు సంతాపంగా నివాళులర్పించారు. మాల్ యజమాని సుభాష్‌రౌత్ స్వయంగా రక్తదానం చేసి, మిగతా వారిలో స్ఫూర్తి కలిగించారు. మొత్తం 107 యూనిట్ల రక్తాన్ని సేకరించగా, ఇందులో 32మంది మహిళలు ఉండటం గమనార్హం. శిబిరంలో జయపురం బ్లడ్‌బ్యాంక్ అధికారి అక్షయ సాహు, ల్యాబ్ టెక్నీషియన్లు సరోజ్ స్వాయి, ప్రతిభ భోత్ర, స్వేతస్వినీ పుజారి, సోనాలి సాహు, తపస్వినీ పండా, అభయ పండా, రక్తదాతల మోటివేటెడ్ కార్యకర్త కార్తీక రౌత్, అరుణ బెహరా, వికాశ పాత్రొ, సుభ్రత బాగ్, సంజయ పాత్రొ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయ హుండీ చోరీ

• సుమారు రూ.15వేలు మాయం?



పొలాల్లో పడి ఉన్న హుండీ

కొత్తవలస: మండల కేంద్రంలోని కొత్తవలస-విజయనగరం రోడ్డులో పాతసుంకరపాలెం గ్రామం సమీపంలో గల పంచముఖస్వామి ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం రాత్రి దొంగిలించారు. మంగళవారం ఉదయం స్వామివారి ఆలయం శుద్ధి చేసేందుకు గ్రామస్తులు వెళ్లి చూడగా హుండీ కనిపించలేదు.దీంతో చుట్టుపక్కల వెతకడం ప్రారంభించారు. గ్రామానికి సుదూరంగా పంట పొలాల్లో హుండీ పగలగొట్టి ఉండడం గుర్తించారు. ఈ హుండీ ఆదాయాన్ని ప్రతి ఆరునెలలకు ఒక సారి లెక్కిస్తారు. ప్రస్తుతం హుండీలో సుమారు రూ.15వేలు ఉంటాయని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మేరకు పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు.

అనుమానంతో భార్యపై భర్త దాడి



చికిత్స పొందుతున్న దేవి

పార్వతీపురం: భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఆమెపై దాడిచేసి గాయపరిచాడు. సోమవారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై మంగళవారం పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గరుగుబిల్లి మండలం కొంకడివరం గ్రామానికి చెందిన బి.దేవి కోలాటానికి వెళ్లి ఇంటికి వచ్చింది. ఎవరితో వెళ్లావని భర్త రమేష్ అనుమానంతో దేవిని దుర్భాషలాడి పలు చోట్ల గాయపరిచాడు. ఈ మేరకు చికిత్సకోసం మంగళవారం ఉదయం ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ షాక్‌తో బాలుడి మృతి

సీతంపేట: మండలంలోని మొగదార గ్రామానికి చెందిన బాలుడు చీమల ప్రేమ్‌కుమార్ (3) విద్యుత్ షాక్‌తో మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. శ్లాబ్ ఇంటి ముందు వేసిన రేకులకు సపోర్టుగా ఉన్న ఐరన్‌పోల్‌కు ఇంటినుంచి ఊహించని రీతిలో విద్యుత్ సరఫరా కావడంతో అక్కడ ఆడుకుంటున్న బాలుడు ప్రమాదానికి గురయ్యాడు. వెంటనే స్థానిక ఏరియా ఆసుపత్రికి వైద్యసేవల నిమిత్తం తీసుకువెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు వినోద్‌కుమార్, మీనాలు గుండెలవిసేలా రోదించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.నీలకంఠరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పూసపాటిరేగ: స్థానిక సినిమా హాలు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తి డెంకాడ మండలం అక్కివరం గ్రామానికి చెందిన ఎం. శ్రీనివాసరావుగా గుర్తించారు. గాయపడిన వ్యక్తిని విజయనగంలోని ఓ ప్రవేటు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం 108 వాహనంలో తరలించారు.

20న చలో విజయవాడ

విజయనగరం ఫూల్‌బాగ్: భవన నిర్మాణ రంగ కార్మికులకు పెండింగ్ క్లెయిములు పరిష్కారం కోసం ఈ నెల 20న చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిస్తున్నామని ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడాల రమణ తెలిపారు. స్థానిక అమర్‌భవన్‌లో మంగళవారం విలేకర్ల సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బి.అశోక్, ఎస్.రంగరాజు, బి.గురువారెడ్డి, అల్తి మారయ్య, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో గిరిజన వర్సిటీకి శంకుస్థాపన

• బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ



వర్సిటీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శేషశైలజ

దత్తిరాజేరు: గిరిజన వర్సిటీకి భూసేకరణ, రైతులకు నష్టపరిహారం చెల్లింపు శతశాతం పూర్తయిందని, త్వరలో వర్సిటీ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ తెలిపారు. దత్తిరాజేరు మండలం మర్రివలస, మెంటాడ మండలం చినమేడపల్లి మధ్య 561.08 ఎకరాల్లో నిర్మించనున్న గిరిజన యూనివర్సిటీ ప్రాంతాన్ని ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు, యూనివర్సిటీ ఏఓ సూర్యనారాయణతో కలిసి పరిశీలించారు. హద్దురాళ్లను చూశారు. జాతీయ రహదారి నుంచి వర్సిటీ వరకు నిర్మించనున్న రోడ్డును 100 అడుగుల నుంచి 120 అడుగుల వెడల్పుకు పెంచాలని రోడ్లు భవనాలు శాఖ డీఈ వాణికి సూచించారు. వర్సిటీ పరిసర ప్రాంతాల్లో కంకర అక్రమ తవ్వకాలు జరగకుండా వీఆర్‌ఏలను కాపలా ఉంచాలని తహసీల్దార్ రమేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జేఈ నరసింహమూర్తి, సర్వేయర్ సత్యం, వీఆర్వో చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బంగారు మెట్టు

• క్రమశిక్షణతోనే విజయం సాధ్యం
• ఇంటర్‌మీడియట్‌లో తప్పటడుగు వేస్తే భవిష్యత్ అధోగతే
• ప్రారంభమైన జూనియర్ కళాశాలలు
• విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలంటున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు



కొత్తగా కళాశాలకు వెళ్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: ఇంతవరకు తల్లిదండ్రుల పర్యవేక్షణలో, సొంత ఊరిలో పాఠశాల చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులు కళాశాల వాతావరణంలోకి అడుగుపెడుతున్నారు. పదో తరగతి పూర్తి చేసి ఇంటర్‌మీడియట్‌లో చేరే విద్యార్థులకు కొత్త అనుభవం. ఈ క్రమంలో కొత్తగా కళాశాలల్లో చేరే విద్యార్థులతో కొత్త పరిచయాలు..కొత్త వాతావరణం..కొత్త పరిసరాలు..సరికొత్త ఆలోచనలు అన్నీ కొత్తదనాన్ని ఇచ్చేవే. ఇష్టపడి కళాశాలల్లో అడుగుపెడుతున్న విద్యార్థులకు ఇవన్నీ కొత్తగా కనిపిస్తాయి. ఇది టీనేజ్‌లో అత్యంత కీలక సమయమే కాకుండా జీవితాన్ని మలుపుతిప్పే దశ. ఏ మాత్రం తొందరపాటు నిర్ణయం తీసుకున్నా జీవితం తిరిగి రానంత వెనక్కి వెళ్లి పరాజయం బాట పడుతుంది. ఇంటర్‌మీడియట్‌లో కొత్తగా చేరే విద్యార్థులు జాగ్రత్తలు పాటిస్తూ ఎలాంటి ఆకర్షణలు, ప్రలోభాలు, చెడు సావాసాలకు గురి కాకుండా ముందుకెళ్తే భవిష్యత్ బంగారమయం కానుంది. ఈ ఏడాది జూన్ 1 నుంచే కళాశాలలు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తీర్ణులైన వారంతా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరుతున్నారు.

చదువుకే తొలిప్రాధాన్యం ఇవ్వాలి

విద్యార్థులు కళాశాల జీవితంలోకి అడుగుపెట్టి ఎన్నో ఆకర్షణలకు లోనవుతుంటారు. అయితే ఈ దశలో అందరికీ చదువే తొలిప్రాధాన్యం కావాలి. జీవితం అల్లరిపాలు చేసుకోకుండా చూసుకోవాలి. సినిమాల ప్రభావంతో కళాశాలలు ఎగ్గొట్టడం, హీరోయిజం చూపించడం వంటివి చేయకూడదు. విధిగా తరగతులకు హాజరై పాఠ్యాంశాలపై దృష్టిసారించాలి. మంచి స్నేహాలవైపు అడుగులువేసి పోటీ పరీక్షలకు సంబంధించి విజ్ఞానం పెంచుకోవడం శ్రేయస్కరం.

ప్రభావితం చేయనున్న స్నేహాలు

ఇంటర్‌మీడియట్‌లో చేరగానే విద్యార్థులను ప్రభావితం చేసే తొలి అంశం స్నేహం. అదృష్టం కొద్దీ ఉన్నత భావాలున్న వారితో స్నేహం కుదిరితే జీవితం ఓ గాడిలో పడుతుంది. లేదంటే ప్రమాదంలో పడే అవకాశం లేకపోలేదు. చదువుపై ఇష్టం, సమాజంపై అవగాహన, అధ్యాపకులపై సదభిప్రాయం ఉన్న వారితో స్నేహం చేయాలి. అలాంటి దృక్పథంతోనే ముందుకు సాగాలి. లేదంటే చెడు వ్యసనాలకు అలవాటుపడి జీవితాలు అంధకారమయ్యే ప్రమాదం ఉంది. సిగరెట్లు, గుట్కా, మత్తు పదార్థాలు, మద్యం లాంటి వాటికి దూరంగా ఉంటే మంచిది. ఇలాంటి వాటికి ఇంటర్మీడియట్ దశలోనే బీజం పడుతుంది. అపరిచిత వ్యక్తులతో సోషల్ మీడియా ద్వారా చాటింగ్, పార్టీలు, వేడుకల పేరుతో స్నేహితులు చెడుదారుల వైపు తీసుకువెళ్లే ఆస్కారముంటుంది. సినిమాల ప్రభావం, స్నేహితుల ప్రోత్సాహంతో ప్రేమాయణం అంటూ మనస్సును కలుషితం చేసుకోవద్దు.

భవిష్యత్ అంధకారం చేసుకోవద్దు



పదో తరగతి తరువాత కళాశాలలో జాయిన్ అయిన విద్యార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలి. ఇంటర్మీడియట్‌లో ఆకర్షణకు గురై చదువును అశ్రద్ధ చేయవద్దు. ఈ వయసులో విద్యార్థులు ఎక్కువగా సినిమా, షికార్లు, ప్రేమ అంటూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా చదువుపై దృష్టిసారించాలి. చిన్న చిన్న విషయాలకు ఒత్తికి లోనుకాకుండా అన్ని విషయాలు తల్లిదండ్రులతో పంచుకుని భవిష్యత్తును చక్కదిద్దుకోవాలి.

– బూరాడ శివకృష్ణ, మోటివేషనల్ స్పీకర్, రాజాం

ఏదో తెలియని లోకంలా..



పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో చేరగానే ఏదో తెలియని లోకంలో విహరిస్తున్నట్లు స్వేచ్ఛాజీవిగా భావిస్తారు. కాలేజీ చదువు ఎంతో విలువైనది. ముఖ్యంగా చెడు వ్యసనాలు, కళాశాలకు డుమ్మా కొట్టడం వంటివాటి బారిన పడకుండా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి. అప్పుడప్పుడు కళాశాలలకు వెళ్లి పిల్లల స్థితిగతులను అడిగి తెలుసుకోవాలి.

– వారాడ వంశీకృష్ణ, వక్తిత్వ వికాస నిపుణుడు, రాజాం

322 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

• ఆమోదం తెలిపిన కమిటీ

విజయనగరం అర్బన్: 2023–24 సంవత్సరాల కాలపరిమితికి గాను విజయనగరం జిల్లాలో పని చేస్తున్న 322 మంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ల జారీకి జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ మేరకు కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ అధ్యక్షతన మంగళవారం ఆమె చాంబర్‌లో జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశం జరిగింది. ఆన్‌లైన్ ప్రక్రియలో స్వీకరించిన దరఖాస్తుల పరిశీలనలో జీఓ నంబర్ 38లో పేర్కొన్న నిబంధనలు, జర్నలిస్టుల అర్హతా ప్రమాణాలు తదితర అంశాలపై చర్చ సాగింది. ఆన్‌లైన్ ప్రక్రియ ద్వారా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర విభాగాల నుంచి జిల్లా వ్యాప్తంగా 385 మంది దరఖాస్తు చేసుకోగా జీఓ నంబర్ 38 నిబంధనల మేరకు అన్ని అర్హతలున్న 322 మందికి అవకాశం కల్పిస్తూ కమిటీ అంగీకారం తెలిపింది. వారిలో పెద్ద, చిన్న తరహా పత్రికలు, పీరియాడికల్స్ నుంచి 165, ఎలక్ట్రానిక్ మీడియా నుంచి 122, ఫ్రీలాన్స్, వెటరన్, ఇతర విభాగాల 35 మంది జర్నలిస్టులు ఉన్నారు. సమావేశంలో భాగంగా జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ అండ్ జిల్లా సమాచార సంబంధాల అధికారి డి.రమేష్ దరఖాస్తులను పరిశీలించి జీఓ నంబర్ 38లోని నియమ నిబంధనలు, ఇతర అంశాల గురించి సభ్యులకు వివరించారు. అర్హత కలిగిన జర్నలిస్టులకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించగా అక్రిడిటేషన్లు జారీ చేయాలని పేర్కొంటూ సభ్యులందరూ సమ్మతి తెలిపారు. చిన్న పత్రికలకు సంబంధించి రెవెన్యూ డివిజన్ ప్రాతిపదికన అదనంగా మరో రెండు అక్రిడిటేషన్లు మంజూరు చేయాలని, స్టేట్ బస్‌పాస్ ఉన్నవారికి ఏసీ బస్సులో ప్రయాణించే అవకాశం కల్పించాలని కోరుతూ కమిషనర్, సమాచార పౌర సంబంధాల శాఖకు కలెక్టర్ ద్వారా లేఖ రాయాలని కమిటీ సభ్యులు సూచించారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి డి.రమేష్, గృహ నిర్మాణ శాఖ పీడీ రమణమూర్తి, ఆర్టీసీ జిల్లా అధికారి అప్పలనారాయణ, శ్రీనివాసరావు, ఆరోగ్యశ్రీ కో–ఆర్డినేటర్ అప్పలరాజు, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు, ఇతర కమిటీ సభ్యులు అల్లు సూరిబాబు (సాక్షి), కె.రమేష్ నాయుడు (ప్రజాశక్తి), వి.వెంకట జగన్నాథరావు (ఎన్.టీవీ), ఎంఎంఎల్‌నాయుడు (10టీవీ), కే.జే.శర్మ (అక్షర కెరటం), బి.జోగారావు (ఆంధ్రజ్యోతి) తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలి

పార్వతీపురం: స్టాఫ్‌సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) గ్రూప్ సి ఉద్యోగాలకు ఈనెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి బి. రామగోపాల్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రూప్ సి స్థాయిలో లోయర్ డివిజనల్ క్లర్క్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగ నియామకాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో 8వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించి 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లోనే ఫీజు చెల్లించవచ్చని ఆసక్తి గల యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉత్కంఠ భరితంగా ఉమెన్ టీ–20 క్రికెట్ లీగ్



• సూపర్ ఓవర్‌లో విజయం సాధించిన వైజాగ్ డాల్ఫిన్స్
• చివరి ఓవర్‌లో గెలుపొందిన విజయనగరం రాయల్స్

విజయనగరం: విజయనగరం వేదికగా ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమెన్ టీ–20 క్రికెట్ లీగ్ టోర్నీ 3వ రోజు ఉత్కంఠ భరితంగా సాగింది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో మంగళవారం రెండు మ్యాచ్‌లు నిర్వహించారు. ఉదయం వైజాగ్ డాల్ఫిన్స్- రాయలసీమ క్వీన్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు సూపర్ ఓవర్‌లో విజయం సాధించింది. టాస్ ఓడిన వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లు నష్టపోయి 161 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన రాయలసీమ క్వీన్స్ జట్టు 20 ఓవర్లు ముగిసే సమయానికి 6 వికెట్లు నష్టపోయి 161 పరుగులు చేయడంతో మ్యాచ్ టై అయింది. దీంతో అంపైర్లు సూపర్ ఓవర్ ఆడించగా.. వైజాగ్ డాల్ఫిన్స్ జట్టు వికెట్ నష్టపోయి 21 పరుగులు జోడించగా.. రాయలసీమ క్వీన్స్ జట్టు 18 పరుగులు మాత్రమే చేయగలిగింది. మధ్యాహ్నం విజయనగరం రాయల్స్- బెజవాడ బ్లేజర్స్ జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో విజయనగరం రాయల్స్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన బెజవాడ బ్లేజర్స్ జట్టు ముందుగా బ్యాటింగ్ ప్రారంభించి నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 124 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన విజయనగరం రాయల్స్ జట్టు 19.5 ఓవర్లలో 4 వికెట్లు నష్టపోయి 125 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

ఉపముఖ్యమంత్రికి ఎంపీ పరామర్శ



ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొరతో మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

సాలూరు: కాలిగాయంతో బాధపడుతున్న ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖామంత్రి పీడిక రాజన్నదొరను విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు ఉపముఖ్యమంత్రిని సాలూరు పట్టణంలోని ఆయన గృహంలో కలిశారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

హోంగార్డ్‌కు చేయూత



రిటైర్డ్ హోంగార్డ్ సుంకరి ఎల్లమ్మకు చెక్ అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో పని చేసి, ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డ్ సుంకరి ఎల్లమ్మకు పోలీసులు తమ ఒకరోజు అలవెన్స్ రూ. 3 లక్షల 20వేల 920ల చెక్‌ను ఎస్పీ ఎం.దీపిక చేతులమీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎల్లమ్మ మాట్లాడుతూ జిల్లా పోలీసులకు తమ శాఖ పూర్తి అండగా నిలుస్తోందంటూ, తనకు సహకరించిన వారందరికీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, కార్యాలయ పర్యవేక్షకులు ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం

• రైల్వేగేటు పడి పగిలిపోయిన ఆటో అద్దాలు
• భయాందోళకు గురైన ప్రయాణికులు



సాంకేతిక సమస్య వల్ల తెరిచిన సమయంలో కిందికి పడి పోతున్న రైల్వే గేటు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట రైల్వే గేటు తెరుస్తున్న సమయంలో వెళ్తున్న ఆటోపై గేటు పైకి లేచి ఒక్కసారిగా కింద పడడంతో ఆటో అద్దాలు పగిలిపోయాయి. మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి,. పురిటి పెంట రైల్వే గేటు మీదుగా నిత్యం ఆరు, ఏడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో మంగళవారం గుంటూరు నుంచి రాయగడ వెళ్లే ఎక్స్‌ప్రెస్ గజపతినగరం మీదుగా వెళ్లడంతో ముందుగా గేట్‌మన్ గేటు వేశాడు. ఇరువైపులా ప్రయాణికులు నిరీక్షించి ఉన్నారు. రైలు వెళ్లిపోయిన తరువాత గేటు తెరవడంతో ప్రయాణికులు అంతా రద్దీగా వెళ్ల సాగారు. తెరిచిన ఒక వైపు గేటు (తూర్పున ఉన్న గేటు)పైకి లేచి గజపతినగరం నుంచి మెంటాడ వెళ్తున్న ఆటోపై పడడంతో ఒక్కసారిగా పడిపోయింది. ఆటోలో ఉన్న ప్రయాణికులు, పక్కనే ఉన్న ద్విచక్రవాహనదారులు, భయాందోళనకు గురయ్యారు. పడిపోయిన గేటును కొంతమంది ప్రయాణికులు సాహసం చేసి అడ్డుకోవడంతో పెనుప్రమాదం తప్పింది.

పటువర్ధనంలో చోరీ

వంగర: మండలంలోని పటువర్ధనం గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో గ్రామానికి చెందిన చుక్కల చిన్నప్పమ్మ రెండు తులాల బంగారం పుస్తెల తాడును గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించి, పరారయ్యారు. తన ఇంటికి సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు గమనించిన దొంగలు ఆమె ఇంట్లోకి చొరబడి, ట్రంకు పెట్టె తాళం పగలగొట్టి, అందులోని పుస్తెలతాడును దొంగిలించారు. ఇదే ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, ఎస్ఐ జనార్దనరావు ఘటన స్థలాన్ని పరిశీలించి, పలు వివరాలు సేకరించారు. రూ.26 వేల నగదు, అరతులం బంగారపు చెవిరింగులు, వదిలి పుస్తెల తాడు పట్టుకుపోయినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది.

గాయపడిన నెమలి అటవీశాఖకు అప్పగింత

• ఫలించిన వైద్యసేవలు



గాయమైన నెమలిని అప్పగించిన పోలీసులు

సీతంపేట: స్థానిక పోలీసులు సారా బట్టీలపై దాడులకు ఎస్సై ఎ.నీలకంఠరావు ఆధ్వర్యంలో పులిగుమ్మి గ్రామానికి మంగళవారం వెళ్తుండగా ఫారెస్టు ఏరియాలో గాయాలైన నెమలిని చూసి పట్టుకుని సపర్యలు చేశారు. వెంటనే పాలకొండ అటవీశాఖకు సమాచారం చేరవేసి ఎఫ్‌బీవో దాలినాయుడు, సిబ్బందికి నెమలిని అప్పగించారు. బుధవారం విశాఖపట్నం జూకు తరలించేందుకు ఏర్పాట్లు చేసి నెమలికి ప్రత్యేక వైద్యసేవలు అందజేశారు. అయినా ఫలితం లేకపోవడంతో నెమలి మృతి చెందింది. డీఎఫ్‌వో ప్రసూన ఆధ్వర్యంలో చిన్నబగ్గ రిజర్వ్‌ఫారెస్టు ఏరియాలో పంచనామా చేసి దహనం చేశారు.

వయోవృద్ధుల ఆశ్రమాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం ప్రకారం వయోవృద్ధుల ఆశ్రమాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని ఆ శాఖ సహాయ సంచాలకులు జీవీబీ జగదీష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో నిర్వహణ లో ఉన్న ఆశ్రమాల వివరాలను 15 రోజుల్లో నమోదు చేసుకోవాలని కోరారు. లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్ పత్రంతో దరఖాస్తు చేసుకొని కలెక్టరేట్ ప్రాంగణంలోని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. పూర్తి వివరాల కోసం 08922-274647 ఫోన్‌ను సంప్రదించాలన్నారు.

భక్తజన పురం

• తారాపురంలో వైభవంగా చింతాలమ్మతల్లి సిరిమానోత్సవం
• అమ్మవారి సేవలో ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ



తారాపురంలో సిరిమానోత్సవం



సిరిమాను వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



సిరిమానోత్సవంలో భక్తజనం

రామభద్రపురం: చింతాలమ్మా.. చల్లంగ చూడమ్మా... అంటూ భక్తులు స్మరించారు. ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. సిరిమాను పూజారి పొట్టంగి తమ్మినాయుడు రూపంలో వీధుల్లోకి వచ్చిన అమ్మవారిని చూసి తరించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆశీర్వచనాలు అందుకున్నారు. రామభద్రపురం మండలం తారాపురం గ్రామంలో ఐదుగురు అమ్మవార్లు చింతాలమ్మ, కొత్తమ్మ, బంగారమ్మ, టీకాలచ్చన్నమ్మ, తారాదేవి అమ్మవార్ల పండగ మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో జరిగిన చింతాలమ్మతల్లి సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు తరలివచ్చారు. దీంతో తారాపురం భక్తపురంగా మారింది. వేకువజాము నుంచి అమ్మవార్లకు పూజలు చేశారు. మొక్కుబడులు చెల్లించారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీలక్ష్మి, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, బొబ్బిలి మున్సిపల్ చైర్మన్ ఎస్.వి. మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ బొబ్బిలి మండలాధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించారు. డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో సీఐ తిరుమలరావు, ఆరుగురు ఎస్ఐలు, వంద మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహించారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



విజయనగరంటౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణమూర్తి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. అనంతరం అమ్మవారికి తీపి పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎల్.సుధారాణి కార్యక్రమాలను పర్యవేక్షించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి, తరించారు.

పోలీస్ ఉద్యోగులకు ఆరోగ్య భరోసా

• వైద్యశిబిరాన్ని ప్రారంభించిన ఎస్పీ ఎం.దీపిక



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: జిల్లాలోని పోలీసు ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం వైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న కిందిస్థాయి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు తిరుమల మెడికవర్ ఆస్పత్రి సహకారంతో జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం వల్ల ఆరోగ్య సమస్యలను గుర్తించక అర్థాంతరంగా మృతిచెందడం, తీవ్రమైన అనారోగ్యానికి గురికావడం వంటివి జరుగుతున్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తున్న హోంగార్డు నుంచి పై స్థాయి అధికారి వరకూ ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్యసేవలు అందించేందుకు తమవంతు కృషిచేస్తున్నామన్నారు. వైద్యశిబిరంలో డాక్టర్ తిరుమల ప్రసాద్, ఏఎస్పీ (అడ్మిన్) అస్మా ఫర్హీన్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్ కుమార్ పాత్రో, సూపరింటెండెంట్ డాక్టర్ మహేష్, ఐసీయూ స్పెషలిస్ట్ డాక్టర్ పీఎస్‌వీ రామారావు, తదితరులు పాల్గొన్నారు.